


# వెలుగురేఖలు


– పులుసు శ్రీనివాస్

ఎడ తెరిపి లేకుండా వాన పడుతూనే వుంది. అసలే ఆ రోజు ఆఫీసులోనే ఆలస్యం అయింది. అందులో ఈ వాన ఒకటి దారి మధ్యలో పట్టుకుంది. ఆ చౌరస్తాలోని ఇరాని హోటల్లో అప్పటికే రెండుసార్లు టీ తాగాను. హోటల్ ముందు బండి మీద వేస్తున్న వేడి వేడి మిరపకాయ  బజ్జీలను కూడా కొనుక్కొని తిన్నాను. మరికొన్ని బజ్జీలను ఇంటికి తీసుకెళ్ళడానికి పొట్లం కట్టించాను. ఆ పక్కనే వున్న పూల దుకాణంలో మల్లె పూలను కూడా కొని పొట్లం కట్టించాను. ఆ  రెండు పొట్లాలు రెండు చేతుల్లో పట్టుకుని రోడ్డు మీదకు సాలోచనగా చూడసాగాను. కార్ల  హెడ్ లైట్ వెలుగుల్లో రోడ్డు మీద కురుస్తున్న వాన చినుకుల వేగాన్ని కొలవసాగాను.

కాస్త వాన తగ్గగానే రోడ్డు మీదకు వచ్చి స్కూటర్ బ్యాగులో ఆ ప్యాకెట్లను పెట్టుకుని  బయలుదేరాను.

అప్పుడు దాదాపు రాత్రి 10 గంటలవుతోంది.

ఇంకా వాన తుంపర్లు పడుతూనే వున్నాయి. అప్పటివరకు కురిసిన భారీ



వర్షం వల్ల రోడ్లన్నీ నీటి మయమయినాయి. డ్రైనేజీలన్నీ పొంగి పొర్లు తున్నాయి. ఎక్కడ గోతులు, బండలు, టెలిఫోన్ వైర్లు, కరెంటు తీగలు వున్నాయో అర్థంకాని పరిస్థితి.

మళ్ళీ వర్షం పెరుగుతుందేమోననే దిగులు ఒక వైపు పీడిస్తుంటే, మరో వైపు ఎక్కడ బండి గోతుల్లోకి దిగుతుందోనని భయం బయలుదేరింది.

ఈ భయంకు తోడు చిమ్మ చీకటి!.... దొంగల బెడద! జేబులో జీతం డబ్బులు.

మునిసిపల్ పార్కు ముందుకు వచ్చేసరికి మరింత భయం పెరిగింది. అక్కడే దొంగలు వారం రోజుల క్రింద మా పక్క సెక్షన్‌లో పనిచేస్తున్న శేఖర్ మీద దాడి చేసి అతని వాచీనీ, వుంగరాన్ని, చివరికి అతని హీరో హోండాని కూడా ఎత్తుకుపోయారు. అంతటితో ఆగితే బాగానే వుండేదే!.... కానీ, ఆ దుర్మార్గులు అతన్ని కసాయిగా కత్తులతో కూడా పొడిచి పారిపోయారు. అయితే, ఆ తరువాత ఆ మిత్రుడు అతి కష్టం మీద ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు.

పార్కు రోడ్డును దాటి అశోక్‌నగర్ వైపు తిరుగుతూ వుండగానే, అనుకో కుండా!...

ఒక నీటి అల... అలా నెట్టింది.

ఒక బురద గుంట... అలా తట్టింది.

అంతటితో నా బండి టక్కున నిలిచిపోయింది.

ఎంత రైజ్ చేసినా ఇంచి కూడా కదలడం లేదు.

గబుక్కున ఇంజన్‌తో పాటు హెడ్ లైటు కూడా ఆరిపోయింది. నిశ్శబ్దం!... నిర్మానుష్యం!... చిమ్మ చీకటి!....

ఎడం కాలు కింద పెట్టగానే!... జివ్వున నరాలు లాగేసే చలి... మోకాలు లోతు బురద నీరు!...

ఒళ్ళు జలదరించింది.

రెండో కాలు కూడా కింద పెట్టి స్కూటర్‌ను నెట్టాను.

కదలలేదు. ముందు చక్రం గుంతలో కూరుకుపోయిందేమోనని రెండు చేతులతో హేండిల్స్ పట్టుకుని గట్టిగా పైకి లేపాను. వెనుక వీల్ మీద కొంచెం ముందుకు జరిపాను.

## తప్పించుకోలేదులే...




*1958లో ఓసారి నెహ్రూగారు అంబాలా కంటో న్మెంట్‌లోని నరహంద్ క్లబ్బుకు వెళ్ళారు. అక్కడ ఆయన గౌరవార్థం ఓ డిన్నర్ ఏర్పాటుచేశారు. భోజన కార్యక్రమం మొదలవగానే నెహ్రూగారి వెంట వచ్చిన ఓ మహాశయుడు గబగబా ప్లేటు అందుకుని అందులో నాలుగైదు చికెన్ ముక్కలు పెద్దవి వేసుకుని ఆదరా బాదరాగా తింటున్నాడు. ఆయనెవరినీ పట్టించుకునే స్థితిలో కూడా లేడు.*

*అతని వెనుకనే నిలుచున్న నెహ్రూగారు మెల్లగా భుజంతట్టి "తొందరెందుకు ఆఫీసర్! నీ ప్లేటులో వున్నది చచ్చిన కోడే ఇక నీనుంచి ఎట్టి పరిస్థితి లోనూ అది తప్పించుకోలేదు" అన్నారు. అక్కడున్న వారికి నవ్వాగలేదు.*

– హిమజా రమణ

ఆ తరువాత మళ్ళీ అదే వరస. ముందు చక్రం పూర్తిగా స్టక్ అయిందని నాకు అర్థం అయింది.

ఎంత ప్రయత్నించినా అంగుళం కూడా స్కూటర్ ముందుకు కదలక, స్టార్ట్‌కాక, అదే నడి రోడ్డుమీద, వర్షపు నీటిలో, అలాగే నిలబడిపోయింది.

ఎటు చూసినా చీకటే!....

ఏమీ కన్పించడం లేదు.

దూరంగా పార్కు గేటు ముందు రెండు లైట్లు, ట్యాంకు బండ మీద మరికొన్ని లైట్లు మాత్రమే గుడ్డిగా వెలుగుతున్నాయి.

నా చుట్టూ నీటి చప్పుడు తప్ప మరేమి శబ్దం విన్పించడం లేదు. కన్ను పొడుచుకున్నా కానరాని కటిక చీకటి. ఇంకా సన్నగా ముసురుపడుతూనే వుంది. దూరంగా ఏదో ఫ్యాక్టరీ సైరన్ మోత. ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాలో సెకండ్ షిఫ్ట్ వదిలినట్లు వుంది.

నా దీన స్థితికి నాకే జాలేసింది. ఎటూ కదలలేని పరిస్థితి. చుట్టూ అంతా నీరే!....

పార్కులోంచి ఎవరిదో స్త్రీ గొంతు గావు కేకవేసింది. నా గుండెల విసిపోయినాయి. ఈ మధ్య ఒక కాలేజీ అమ్మాయిని ఆ పార్కు సిబ్బంది సహకారంతో కొంతమంది దుండగులు పాడు చేశారట. ఆ వార్త సంచ లనం రేపింది. అది గుర్తుకు రాగానే నాకు ఒళ్ళంతా చెమటలు పట్టాయి. పైనుంచి వర్షం! ..... లో నుంచి చెమటలు.

అప్పటివరకు ఎంతో సహజంగా విన్పించిన చినుకుల చప్పుడు కూడా అప్పుడు ఎంతో భయంకరంగా విన్పించసాగింది. నేనేదో చిక్కని అడవిలో చిక్కు కున్నట్లు, నా మీదకు ఆటవికులు ఈటెలతో పరుగులెత్తుకుని వస్తున్నట్లు వణికిపోసాగాను. అప్పుడు అక్కడ చీమ చిటుక్కుమన్నా నా గుండె ఝల్లు మంటున్నది.

"దొంగ నా కొడుకులు!... ఇవ్వాళే నాకు ఈవినింగ్ టర్న్ డ్యూటీ వేయాలా?... జీతాల రోజు, ఎవ్వడూ చేయకపోతే నాకు తగిలించారు. అసలే ఆ సచివాలయం రాత్రి పూట పెద్ద 'బూత్ బంగ్లా'లాగ వుంటుంది. ఏ మూలను ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. ఆ అధికార చక్ర బంధం లోంచి ఎలాగో ఓలాగ బయటపడ్డానంటే ఈ వాతావరణ పద్మ వ్యూహంలో చిక్కుకున్నాను కదా?..." అనుకున్నాను.

"ఈ డొక్కు స్కూటర్ ఒకటి!.... ఆ దొంగ బావగాడు మాయ మాటలు చెప్పి నాకు అంటగట్టాడు. వాడేమో హీరో హోండా కొనుక్కోవడానికి మానాన్న దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసి నాకేమో ఈ పనికిమాలిన స్కూటర్‌ను అంటగట్టాడు. ఛీ!... ఈ నాన్నలకు కూడా బుద్ధి వుండదు. అల్లుళ్ళంటే అంత భయం, కొడుకులంటే ఇంత చులకనా?.... అని నాలో నేనే తిట్టిపోశాను.

కాలు కేదో మెత్తగా చుట్టుకున్నట్లు కాగానే ఒళ్ళు జలదరించింది. పామే మోనని జవ్వన పైకెత్తి కాలు జాడించాను. పాలిథిన్ పేపర్!.... బలవంతంగా వదిలింది.

"ఈ రోజు పొద్దున లేవగానే ఎవరి మొహం చూశానో!... దరిద్రులు!... అన్నీ కష్టాలే!... నడి సముద్రంలో చిక్కుకున్న నావలాగే అయిపోయింది నా బతుకు. ఎప్పుడేం జరుగుతుందో ఏమో!... ఏమీ తెలీని అయోమయ పరిస్థితి!...." అనుకోగానేనా కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

భోరున ఏడవాలని కూడా అన్పించింది. కానీ గట్టిగా శ్వాస తీసినా ఆ చప్పుడుకు దొంగలు పొడుస్తారేమోననే భయం. ఎంత ఆపుకున్నా ఆగకుండా అప్పుడప్పుడు వెక్కిళ్ళు గబుక్కున బయటికొస్తున్నాయి.

అప్పుడు!...

ఒక సైకిల్ వేగంగా వచ్చి, టప్పున స్కూటర్‌ను గుద్దుకుంది. ఒక

వ్యక్తి దబ్బున కిందబడ్డ శబ్దం. ఆ వెంటనే చివ్వున బురద నీరు చిమ్మిన అనుభవం.

అతను మొత్తంగా నీటిలో మునిగిపోతే – నా బట్టలన్నీ బురదమయమై నాయి.

ఆ నీటిలో పడ్డంత వేగంగా పైకి లేచిన అతను, చటుక్కున నా కాలర్ పట్టుకున్నాడు. దానితో నా కడుపులో ఖచ్చితంగా కత్తి దిగే వుంటుందని కళ్ళు గట్టిగా మూసుకున్నాను.

"లైటు లేకుండా చీకట్ల నిలబడతావ్ బే!..." అన్నాడు అతను కోపంగా.

"స్కూటర్ చెడిపోయింది!...." అన్నాను వణికిపోతూ కళ్లు మూసుకునే.

"అయితే మాత్రం!... రోడ్డు నట్టనడువ!... నీళ్ళల్ల నిలబడాల్నా?...." అన్నాడు అతను కాలర్ వదిలేసి, వంగి సైకిల్ తీసుకుంటూ.

"అస్సలు!.... కొంచెం గూడా కదుల్తలేదు!... అందుకే నిలబడ్డ!..." అన్నాను భయం భయంగానే.

"అట్లనా!.... జరుందు అయితే!..." అని సైకిల్ బురదకు అవల, రోడ్డుకు చివరన నిలబెట్టి మళ్ళీ నా దగ్గరకు వచ్చాడు.

అప్పటికి నా నవనాడులు కాస్త నా స్వాధీనంలోకి వచ్చినట్టున్నాయి. అందు కేనేమో అతన్నుంచి గుప్పున వచ్చిన సారా వాసనని నా నాసికలు చప్పున పట్టేశాయి. దానితో మళ్ళీ నా గుండె వేగాన్ని పుంజుకుంది.

"అసలు అతను కన్పించక నన్ను గుద్దుకోలేదు!.... తాగిన మత్తులో తాకి పడ్డాడు!..." అనుకున్నాను.

"దొంగలుండే చోట!... తాగిన మత్తులో ఒక ఆగంతకుడు అంటే!.... ఇక నా పని దగ్గర కొచ్చిందన్నమాట!..." అనుకున్నాను. అప్పుడు ఇక నా చేతి గడియారంలోని సెకండ్ల ముల్లే నా ముందు ప్రత్యక్షమై, ప్రతి క్షణం ఒక చురకత్తిలాగ నా కళ్ళ ముందు 'చమక్' నమెరవసాగింది.

అతను కూడా నా స్కూటర్‌ను జరవడానికి కాసేపు ప్రయత్నించాడు. కానీ, సాధ్యం కాలేదు. ఇద్దరం చెరో వైపు హేండిల్స్‌ను పట్టుకుని వెనుక చక్రం మీద బండిని బురదలోంచి బయటికి తెచ్చాం. ఆ రోడ్డు మూలగా వున్న ఒక కరెంటు స్తంభం దాకా బండిని లాక్కొచ్చి అక్కడ స్టాండ్ వేశాడు.

ఒకసారి స్తంభం వైపు చూశాడు.

"నీయవ్వ!... రోజూ ఈ లైటు వెలిగేది!... దీనికి కూడా ఇయ్యాల 'వేంబుట్టిందో!..." అన్నాడు గొనుగుతున్నట్లు.

"ఇంగ గిట్లగాదుగానీ, ఒక్క నిమిషం ఆగు!..." అని ఆ కరెంటు పోలును రెండు చేతులతో బట్టి గట్టిగా ఊపాడు.

ఆ కదలికలకు ఆ స్ట్రీట్‌లైటు కొంచెంకొంచెం వెలిగి ఆరిపోసాగింది. అయినప్పటికీ అంత చిమ్మ చీకటిలో ఆ చిన్న వెలుతురు ఎంతో గుండె నిబ్బరాన్ని ఇచ్చింది.

"స్కూటర్ల పానలున్నాయా?" అడిగాడు అతను.

"ఆ... వున్నాయ్!" అంటూ గబగబా డిక్కీ ఓపెన్ చేసి, స్పానర్ల సెట్ తీసి అతని ముందుంచాను.

అతను ముందు చక్రం ముందు కూర్చుని పనిప్రారంభించాడు. చక్రం మధ్యలో వున్న క్యాపును తీసి, స్క్రూ డ్రైవర్ సహాయంతో ఐరన్ పిన్‌ను కూడా వూడదీశాడు. ఆ తర్వాత ఓపెన్ చేయాల్సిన నట్టుకు అక్కడున్న ఏ స్పానర్‌సైజ్ సరిపోకపోవడంతో అతను ఆదోలా కదలసాగాడు. కాసేపు నుంచుని అటూ ఇటూ చూశాడు. నోట్లో వూరిన తంబాకు ఉమ్మిని 'తుప్'న పక్కకు ఉమ్మేశాడు. రెండు జేబుల్లో చేతులు పెట్టుకున్నాడు. పచార్లు ప్రారంభించాడు. అతని వాలకాన్ని చూడగానే మళ్లీ నా మదిలో ఎక్కడో కత్తులు మెదిలాయి. మనీపర్స్‌ను మరోసారి నా డొక్కలో భద్రంగా చూసు కున్నాను. ముందుజాగ్రత్త కోసం బనీనులోపల దాచుకున్న ఆ మనీపర్సును, ఆ విధంగా అప్పటికే అనేకసార్లు తడుముకున్నాను.

'అతను చుట్టూ ఎవరులేనిది చూసి ఒక్కసారిగా దాడిచేస్తాడేమో! కత్తితో పొడుస్తాడేమో! చేతికున్న వాచీ, చొక్కాలో డబ్బులు లాక్కుపోతాడేమో!' అని దిగులుపడ సాగాను.

'మొత్తానికి అతను దుర్మార్గునిలాగానే కన్పిస్తున్నాడు. లేకపోతే మద్యపా నాన్ని ప్రభుత్వం నిషేధిస్తే! ఇతను సారాయి ఎలా తాగగలిగాడు! దొంగలకే కదా దొంగసారాయి దొరికేది?' అన్పించింది.

'అయినావీని మొహం చూడు ఎలా వుందో? గాట్లుపడి. గెడ్డ పెరిగి వుంది. పళ్లు! తొర్రిపండ్లు... వున్నపండ్లు కూడా ఎర్రగా గారబట్టి వున్నాయి. జుట్టు! నిక్కబొడుచుకుని దుమ్మల గొండిలాగే వుంది. వాని తలా, వాని బట్టలు ఆయిలుబట్టీ, వాని చెవ్వలు తీగలు చుట్టీ ఎంత అసహ్యంగా వున్నాయి?' అనుకున్నాను.

'అసలు ఈ రౌడీవెధవ పొద్దంతా రైల్వే ప్లాట్‌ఫాం మీద నిద్రపోయి, రాత్రివూట దారిదోపిడీలకు పాల్పడుతున్నట్టుంది. లేకపోతే వీనికి నాతో ఏం పని? వీని ధారిన వీడు పోక? మా శేఖర్‌ను పొడిచింది కూడా వీడే అయి వుంటుంది. ఇక నా పని కూడా అతిత్వరలో కానున్నదేమో!' అనుకోగానే విపరీతమైన భయం వేసింది.

ఎటు పరిగెత్తాలన్నా కిలో మీటరు దగ్గర వెలుతురు లేదు. అక్కడ కూడా మనుషులుంటారనే నమ్మకం మాత్రం లేదు.

అతను ఏమాత్రం వేగంగా కదిలినా, వెంటనే అతని కాళ్లమీదపడి ప్రాణ భిక్ష పెట్టమని వేడుకోవాలన్పించింది. 'వాచీ, జీతం డబ్బులు, చివరికి స్కూటర్ కూడా ఇస్తాను కాని, కత్తితో మాత్రం పొడవద్దని ప్రాధేయపడాలి' అనుకున్నాను.

"చూడు సారూ! యాడ పనిచేస్తున్నవ్?" అడిగాడు అతను నెమ్మదిగా.

"నేనా... నేను... సెక్రటేరియట్‌లో పనిచేస్తున్న" అన్నాను కంగారుగా.


"అచ్చా... అట్లనా.. అయితే పాయె గనీ! ఈ వీల్ ఓపెన్ చేయాల్నంటే వేరే పానగావాలె? అదిలేకపోతే పని నడవది. నువ్వొక్క పనిచేయి. నా సైకిల్ తీసుకుని గిట్ల సక్కగా బోయినవనుకో దగ్గర్నే కార్మికనగరని మా బస్తీ వస్తది. అక్కడొక్క మైసమ్మ గుడి వుంటది. అక్కన్నుంచి లెఫ్ట్‌సైడ్ తిరుగు. జర ముందటికి బోయినంక 'రిక్షా పోచయ్య ఇల్లెక్కడ?' అని అడుగు. అండ్ల 'మీ పొందు ఇస్కూటర్ పావలియ్యంటుండ'ని నా పేరు

## ఫాస్ట్ మ్యూజిక్

"సంగీతం ఇపుడు చాలా ఫాస్ట్‌గా వుంటోంది కదండీ!" ప్రముఖ సంగీత దర్శకుడు నౌషాద్‌ను కలుసుకున్నాక అభిమాని వ్యాఖ్యానించాడు.

"నిజమే సుమండీ! నేను 70 సినిమాలకు సంగీత దర్శకత్వం వహించడానికి 50 సంవ త్సరాలు పట్టింది. ఇప్పుడు ఐదేళ్ళల్లో 200 సినిమాలకు సంగీత దర్శకత్వం వహిస్తున్నారు. వాదు మన కళ్ళముందే కనిపిస్తుంటే కాదని ఎలా అనగలను? నిజంగానే మ్యూజిక్ ఫాస్ట్ అయ్యింది లెండి..." అంటూ చురక అంటించాడు ఉద్దండ సంగీత పండితుడు నౌషాద్.

– హిమజా రమణ



జెప్పి పట్టుకురా. ఈ లోపల నేను ప్లగ్గును సాఫ్ చేస్తా! స్టార్ట్ కూడా అయిత లేదు కదా? ఇంజన్లకన్నీ నీళ్లు పోయినయ్?" అన్నాడు అతను ఉరఫ్ పాండు.

పాండు అంత సముదాయించి చెప్పినా నాకుమాత్రం అతనిమీద నమ్మకం కలగడంలేదు. అతను నా వెనుక ఏం కుట్ర పన్నుతున్నాడోనని ఒకటే అనుమానం. అయినా ఆ పరిస్థితుల్లో అతను చెప్పినట్టు వినకుండా మరో మార్గం నాకు లేదు.

పాండు సైకిల్ తీసుకుని బయలుదేరాను. ఎప్పుడో చిన్నప్పుడు మా పక్క వూరి బడికి చదువుకోవడానికి సైకిల్‌మీద వెళ్లేవాడిని. ఇంక ఈ మధ్యకాలంలో సైకిలే తొక్కలేదు. మళ్లీ ఇన్ని ఏళ్ల తర్వాత సైకిల్ ఎక్కవలసివచ్చింది. ఒకవైపు సైకిల్‌మీద పోతుంటే చిన్నప్పటి బడి జ్ఞాపకాలు తీయగా గుర్తుకు వస్తుంటే! మరోవైపు చీకట్లో ఏమీ కన్పించక భయం పీడిస్తోంది.

గతుకుల రోడ్డు దిగినాక కాలిబాట వచ్చింది. ఆ బాటకు ఇరువైపుల చిక్కని సర్కార్ తుమ్మచెట్లు అలముకుని వున్నాయి. మధ్యమధ్య పెంట కుప్పలు, గాజుపెంకులు, రాళ్లగుట్టలు పోగుపడి వున్నాయి. ఎక్కడినుంచో చెరువు మత్తడి పడ్డట్టు డ్రైనేజీ పొంగుతున్న నీటి శబ్దం విన్పిస్తోంది. ఆగి ఆగి కీచురాళ్ల కేరింతలు! కుక్కల ఏడుపులు! గుండెలు పీచుపీచుమంటున్నాయి. భయంతో మెల్లమెల్లిగా అన్ని కుప్పలను తప్పించుకుంటూ చాలా జాగ్రత్తగా సైకిల్‌ను నడిపించసాగాను.


"గుర్"మంటూ ఒక్కసారిగా ఎలుగుబంటిలాగ వున్న ఒక ఆకారం గుబురు చెట్లలోంచి నామీద పడింది.

"అమ్మా" అని కేకేసిన నేను నాకు తెలీకుండానే స్పీడ్‌గా సైకిల్ తొక్కాను. అదృష్టం బాగుండి ఏ గడ్డా ఎదురైపడిపోలేదు. ఆ ఆకారానికి దొరక్కుండానే తప్పించుకున్నాను.

అది ఈరపంది! దానివెంట దాని పసిపిల్లలు కూడా బయటికి రావడంతో అది తిరిగి వెనుకకు వెళ్లిపోయింది. నా చిన్నప్పుడు ఒక్కసారి మా వూళ్లో ఎరుకలి బుచ్చి ఈనిసీ పంది మా అన్న కాలిని కొరకడాన్ని స్వయంగా చూశాను. అప్పటినుంచి నాకు ఈనిసీ పందులంటే ఒక్కటే భయం.

'ఈనిన పందులకు కోపం ఎక్కువ వుంటుంది. వాటి జోలికి పోవద్ద'ని మా అమ్మమ్మ ఎప్పుడూ చెప్పేది.

"అబ్బ! అదృష్టం బాగుంది! పంది దాడి నుంచి తప్పించుకోగలిగాను" అనుకున్నాను వూపిరి పీల్చుకుంటూ.




## కుడి ఎడమైతే...

అమితాబ్ బచ్చన్ దగ్గరకు ఒక అభిమానివెళ్లి, 'సార్ మీకు ఎడమ చేతి వాటం కదా! అది మీకు చిత్రంగా అనిపించడం లేదా?' అనడిగాడు.

అమితాబ్ క్షణం ఆగి "మీలాగే ఒకరు కుక్క ఎడమ నుంచి వెడితే మంచిదా? లేక కుడినుంచి వెడితే మంచిదా? అనడిగాడట ఓ జ్యోతిష్యుడ్ని. దానికాయన 'నాయనా! అది కరవకుండా వెళితే మంచిది' అన్నాడు. అలాగే కుడిచేతివాటమైనా, ఎడమచేతివాటమైనా నటన బాగుంటేచాలు. నా నిర్మాతకు నాలుగు డబ్బులు తెస్తే చాలు" అంటూ చెప్పాడు నవ్వుతూ అమితాబ్.

– హిమజా రమణ

ఎదురుగా మైసమ్మ గుడి కన్పించగానే క్షణం అక్కడ ఆగాను. 'కార్మికనగర్' అనేబోర్డు కన్పించింది. అక్కడ ఇద్దరు ఆడవాళ్లు లేని నించున్నారు. వాళ్ల చీరలు ఉల్లిపొరల్లా కదులుతున్నాయి. వాళ్ల జడల్లో మల్లెలు చిన్నబోయి చూస్తున్నాయి. వారి నోళ్లు పాన్లతో పండిపోయాయి.

వాళ్లిద్దరూ ఒకేసారి ఎడంచేత్తో ఉల్లిపొర కొంగును జారవిడిచి కుడిచేత్తో 'రమ్మ'ని సైగచేశారు చిలిపిగా నవ్వుతూ.

'అమ్మో' అనుకుని ఆ వెంటనే మళ్లీ నా సైకిల్‌ను తోలడం ప్రారంభించాను.

'దొంగ సచ్చినోడ!' అని వాళ్లు తిట్టారు నిరాశగా. ఇంకా కాస్తదూరం పోయాక ఒక వ్యక్తి ఒక ఇంటి తలుపులను బాదుతుండడం కన్పించింది. అతను నన్ను చూసి కొట్టడం ఆపి నావైపు తీక్షణంగా చూశాడు. అతని కళ్లు నిప్పకనికల్లా మెరుస్తున్నాయి. బాగా తాగినట్టున్నాడు. ఊగిపోతున్నాడు.

"బ్రదర్! ఇక్కడ రిక్షా పోచయ్య ఇల్లెక్కడ?" అడిగాను బెరుకుగానే.

"ఏయ్ గీడ గవన్నీ అడగద్దు! గిప్పుడు ఏం మాట్లాడినా ఈపులు వలుగుతయ్! ఎళ్లెళ్లు" అని మళ్లీ తలుపులు బాదడం ప్రారంభించాడు.

'నీయవ్వ నువ్ జల్ది తలుపులు దియ్యకపోతే మొత్తం గుడిసెనే కాలబెట్టి నిన్ను జంపుతముండా!" అంటూ ఎవరినో బెదిరించసాగాడు. అగ్గిపెట్టె కోసం జేబులన్నీ తడుముకోసాగాడు సోలిపోతూ.

"అరేయ్ బాడ్కావ్! నీకు దమ్ములుంటే కాలబెట్టురా! ఈ గుడిసే నేనూ లేకపోతే ఇంక నీకు దిక్కేదిరా సాలె! పైన ఇంట్ల ఇచ్చిన పాపాన పోవు సంపాదిచ్చిందంతా తాగి తందనాలుడతవ్! ఇంక మంచి కూరలుగావల్నని నన్నే కొడతాన్‌బే! పోరా పో ఆ కల్లుకాంపోండ్లనే పండుకపో" అంటూ ఆ ఇల్లాలు తిట్టిపోయసాగింది.

నాకు వెన్నులోంచి వణుకు పుట్టింది. ఇంక కాసేపు అక్కడ వుంటే ఎంత దారుణాన్ని చూడవలసి వస్తుందోననే భయంతో వెంటనే బయలుదేరాను.

ఇంకో రెండు గుడిసెల అవల మరో రేకుల ఇంటి ముందు ఒక ముసలమ్మ బొగ్గుల కుంపటి ముందు కూర్చొని చలికాగుతూంది. ఆమె పక్కన మరో ముసలాయన కూర్చొని చుట్ట తాగుతున్నాడు. వారి పక్కన రెండు మేకలు నెమరు వేసుకుంటుంటే మరో కుక్క వాటి మూతులనే తీక్షణంగా పరిశీలిస్తోంది.

"తాతా ఇక్కడ రిక్షా పోశయ్య ఇల్లెక్కడ కొంచెం జెప్పవా?"

అడిగాను వారి దగ్గరగా వెళ్లి బతిమిలాడుతున్నట్లు

"నేనే!... ఏంగావాలె!..." అడిగాడు ఆ ముసలాయన చుట్ట నోట్లోంచి తీసి ఆ పక్కనే ఉమ్మేస్తూ.

"అమ్మ!... బతికానురా బాబు!" అనుకున్నాను నేను ఒక్కసారిగా గుండెల నిండుగా ఊపిరి తీసుకుంటూ.

ఏం లేదు తాతా! మీ కొడుకు పాండు లేడూ! ఆ రోడ్డు మీద నా స్కూటర్ చెడిపోయింది... దానిని బాగు చేస్తాండు... మీ ఇంట్లో స్కూటర్ స్పానలున్నాయటా!... కొంచెం ఇయ్యమన్నాడు..." అన్నాను సైకిల్ దిగి.

'గట్లనా... గందుకే ఇంక రాలేదా? కంపెనీలో ఓటి జేస్తాండేమో అనుకుంటానం మేము!... " అంటూ వెనుక గది వైపు కేక వేశాడు. పోశయ్య స్పానర్ల కోసం.

ఓ పడుచుపిల్ల తలుపులు తీసుకొని గది బయటకు వచ్చి, ప్లాస్టిక్ ప్యాకెట్లో చుట్టి వున్న స్పానర్ల కట్టను నాకిచ్చింది. ఆమె పాండు భార్య అయి వుంటుందనుకున్నాను.

"మంచిదే తాతా!... వస్త మళ్ళీ! " అనుకుంటూ తిరుగుముఖం పట్టాను నీరసంగా.

ఆ బస్తీ ఇటీవలే ఏర్పడినట్టుంది. ఒక వైపు మెయిన్ డ్రైనేజి వుండగా, మరో వైపు మునిసిపాలిటీ చెత్తకుప్పల ఖాళీ స్థలం వుంది. ఆ ఖాళీ

స్థలంలోనే అనేక పిచ్చి మొక్కలు మొలిచాయి. డ్రైనేజీ పక్కనుంచే ఒక బైపాస్ రోడ్డు వేశారు. అయితే ఆ రోడ్డు మధ్యలో నిర్మించ తలపెట్టిన బ్రిడ్జిపూర్తి కాలేదు. దానితో ఆ రోడ్డు నిరుపయోగమైంది. ఆ రోడ్డు మీద ఎవరూ నడవకపోవడంతో అలగా జనం' అంతా కూడి డ్రైనేజీకీ రోడ్డుకు మధ్యలో వున్న కొంచెం ఖాళీ స్థలంలో గుడిసెలు వేసుకున్నారు. కాస్త డబ్బులున్న వారు సిమెంట్ రేకులతో ఒక్కో రూము కూడా నిర్మించుకుని కాలం వెళ్ళబుచ్చుతున్నారు.

"ఏందివయ్యా! ఇల్లు దొరికిందా?..." అని ప్రశ్నించడంతో ఉలిక్కిపడి అటు వైపు చూశాను.

అతనే! ... ఇంత క్రితం గుడిసె కాళబెడతావని బెదిరించిన మహానుభావుడు!... అతని భార్య!.. మహాతల్లి!.. ఇంట్లకే రావద్దురా బాడ్కావ్!... అని తిట్టినావిడ... వేడి వేడి రొట్టెలు చేసి ఇస్తుంటే తినుకుంటూ, చిలిపిగా నవ్వుకుంటూ అడిగాడు.

"ఆ! దొరికింది...! " అని పొడిగా సమాధానం ఇస్తూ అలాగే వెళ్ళిపోయాను ఆశ్చర్యంగా. వారి అన్యోన్య దాంపత్యాన్ని అర్థం చేసుకోవడానికి నాకు ఆ కొద్ది సమయం సరిపోలేదు.

నేను వచ్చేసరికి పాండు ప్లగ్ కూడా సాఫ్ చేసి స్కూటర్‌ను స్టార్ట్ చేయగలిగాడు. స్కూటర్ చప్పుడూ, హెడ్ లైట్ వెలుతురూ చూసేసరికి నాలో కాస్త ధైర్యం, ఆశా చోటు చేసుకున్నాయి.

స్పానర్ సెట్ అందివ్వగానే ముందు వీల్‌ను విప్పడం ప్రారంభించాడు. తుప్పు పట్టి ఊడిపోయిన బ్రేకు రింగు ముక్కలను బయట పడేసి, మళ్ళీ వీల్‌ను బిగించేశాడు.

"దానికి సరిపోయే స్పానర్ వుంటే ఒక్క నిమిషం పనే!... కానీ, ఆ స్పానర్ కోసమే కదా ఇన్ని తిప్పలు పడాల్సి వచ్చింది!" అనుకున్నాను విచారంగా.

పాండు తన స్పానర్లను సర్దుకుని, స్కూటర్‌కు అంటిన ఆయిల్ మరకలను గుడ్డతో తుడుస్తుంటే, నేను నా స్పానర్ సెట్‌ను తీసుకోవడానికి కిందికి వంగాను. అంతే!...

టప్పన నా చొక్కాలోంచి అనుకోకుండా పర్స్ కింద పడింది. చప్పన పాండు ఆ వైపు చూశాడు. చటుక్కున నా గుండె గొంతులో ఇరుక్కున్నట్లు బాధపడసాగాను. మళ్ళీ నా బుర్రలో అనుకోకుండా చురకత్తి, దారిదోపిడీ గాళ్ళు ప్రత్యక్షమయ్యారు.

"ఛీ... ఒక్కక్షణమైతే తప్పించుకుని వెళ్ళి పోయేవాన్ని కదా?... ఎంత పనైంది!..." అని నా దురదృష్టాన్ని నేనే తిట్టుకున్నాను.

ఆ చిన్న పర్స్‌లోవుండమన్నట్లు వంద రూపాయిల నోట్లు రెపరెప లాడుతూ బయటకు కన్పించడంతో మరింత కోపం వచ్చింది.

పాండు వంగి పర్స్ తీసి నా చేతికిచ్చాడు. నేను నిరుత్తరుడనై అలాగే చూస్తుండి పోయాను.

"ఏంది సారూ!... ఇయ్యాల మీ జీతాలా!" అడిగాడు పాండు మామూలుగానే.

"ఆ బ్రదర్!.." అన్నాను కంగారుగా. 'అందుకే అన్ని డబ్బులున్నాయి. వాటితోనే నా సంసారాన్ని ఈ నెలంతా నడపాలి. అంతేకానీ, ఏ విధంగానూ ఆ డబ్బులు నా వద్ద మిగిలేవి మాత్రం కాదు!... ' అని చెప్పి ప్రాధేయ పడుతున్నంత ఆతృతగా అతని వైపు చూశాను.

"నెలంతా కష్టపడితే వచ్చిన పైసలను గట్ల పారేసుకుంటే ఎట్లామరి?... పెండ్లాం పోరగాళ్ళు ఏడవరా?.. అసలే రోజులు మంచిగలేవు. భద్రంగా దాసుకో!..."అనుకుంటూ స్పానర్ల ప్యాకెట్‌ను సంకలో పెట్టుకుని వెళ్ళి పోవడానికి సిద్ధమైనాడు పాండు.

నాకు అతని మంచి మాటలు విన్నాక ఏడుపు వచ్చినంత పనైంది. గబగబా పర్స్‌లోంచి వంద రూపాయిల నోటు తీసి అతనికి ఇవ్వబోయాను.

"నాకంత ఆత్యాశలేదు సారూ! ఏదో తోటి మనిషి రాత్రి పూట కష్టపడుతుండని సాయం చేసిన అంతే!... అసలు నీ దగ్గర పైసలు లేకుంటే ఏం జేసేటోనివి?... నువ్వేంజేస్తవో నాకు దెల్వది గనీ, నేను మాత్రం పట్టగనే ఇంటికి బోదును సరే!... ఇప్పుడు నీ దగ్గర పైసలున్నయ్ కాబట్టి... ఇరువై రూపాయిలు ఇయ్యి!... చాలు"... అన్నాడు పాండు సైకిల్ స్టాండ్ తీసి. అంతసేపు గాఢ అంధకారంలో చిక్కుకున్న ఆకాశంలో ఆకస్మాత్తుగా మెరుపులు మెరిసి, కొన్ని వెలుగురేఖలు నేలను తాకాయి.

వెంటనే ఇరువై రూపాయిల నోటుతీసి అతనికివ్వ గానే, అతను అతి మామూలుగా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. నేను మాత్రం ఆ అతి మామూలు వ్యక్తి ఔన్నత్యాన్ని అంతసేపు గుర్తించనందుకు సిగ్గుతో కాసేపు అలాగే నించున్నాను.

